# మినీకథ

# కిం కర్తవ్యం



**పి.వి. కృష్ణారావు, వేములపల్లి మోహనరావు**

రన్‌వే మీదనుంచి పైకి లేచింది విమానం. సీట్ బెల్ట్ సడలించి కిటికీ లోంచి తొంగిచూశాడు డాక్టర్ ఆదెయ్య. అస్తవ్యస్తంగానూ, అక్కడక్కడా పొందికగానూ పాలపుంతలో నక్షత్రాలకి మల్లే విస్తృతంగా న్యూయార్క్ నగర దీపాలు.

స్టేట్ యూనివర్సిటీ ఆహ్వానం మీద 'సైకాలజీ ఆఫ్ పావర్టీ'పై జరిగిన అంతర్జాతీయ సదస్సులో రీసెర్చ్ పేపర్ చదవడానికి ఐదు రోజుల క్రితం అమెరికా వచ్చాడు. మరో గ్రహం లాంటి న్యూయార్క్‌లో, జెట్‌లాగ్‌తో తన ఆలోచనల తాలూకు [illegible]మెంట్‌తో అక్కడ గడిపిన ఆ కొద్ది రోజులకి త[illegible]తంలో ఎంతో ప్రాధాన్యత వుంది. ఇదివరకటి తన యూరప్ ట్రిప్పులకి మల్లే కాదు. ఆదెయ్య తన భవిష్యత్ కార్యక్రమాల్ని గురించి ఆలోచించడం మొదలుపెట్టాడు.

కృష్ణా డెల్టాలో ఒక సంపన్నమైన గ్రామానికి దూరంగా విసిరివేయబడ్డ ఓ గూడెంలో, మిషనరీ స్కూల్లో మొదలయిన తన చదువు, సోషియాలజీలో పిహెచ్.డి. వరకు ఎలాసాగిందో తనకి మాత్రమే తెలుసు. అమ్మ కిరాణాకొట్టు నుంచి తెచ్చిన పొట్లాలు విప్పి ఆ కాగితాలపై అక్షరాల్ని కూడబలుక్కుని చదివిన తన కుతూహలం విద్యా సముపార్జన పట్ల ఎప్పుడూ వుంటూనే వచ్చింది. జిజ్ఞాస. ఏదో తెలుసుకోవాలని, చెయ్యాలని ఆరాటం. అదే తన జీవితాన్ని నడిపింది.

రిజర్వేషన్లు, స్కాలర్‌షిప్పులే కాదు, తన మార్గంలో ఎన్నో అవరోధాలు, మరెన్నో అవమానాలు. అయినా ఎన్నడూ తను తలవంచలేదు. మెరిట్‌లో ఎవరికీ తీసిపోనూలేదు.

ఎదిగిన కొద్దీ హిందూ ఈథాస్ అతనికి తెలిసొచ్చింది. మార్క్సిజం చదవడంతో కలిగిన సామాజిక స్పృహ తనకో జీవన దృక్పథాన్నిస్తే, సామాజిక శాస్త్రాధ్యయనానికి ఆయత్తమయ్యాడు. పురాణకాలం నుంచి నేటిదాకా సమాజంలోని అట్టడుగు వర్గాల జీవనరీతుల్ని, వ్యక్తిత్వ లక్షణాల్ని పరిశీలించి విశ్లేషిస్తున్నాడు. "బీదల సంస్కృతి"పై అతని డాక్టరేట్ డిగ్రీ. సమాజ యంత్రాంగాన్ని నడిపే మధ్య తరగతి వ్యక్తుల విలువలకి, బీదల విలువలకి తేడా తెలుసుకున్నాడు. అదృష్టం మీద నమ్మకం, ముందుచూపు లేకపోవడం, తొందరపాటు, న్యూనతా భావాలు...ఓహ్...ఎన్ని...ఎన్నని...

స్పృహ, విప్లవం — ఈ రెండింటిలో స్వభావ పరిమితుల వల్లా, అధునాతన కాలంలో సాయుధ విప్లవం అసాధ్యమనే దృక్పథంవల్లా ఆదెయ్య సమాజంలో మార్పు కోసం మొదటిదాన్ని ఎన్నుకున్నాడు. జీవితంలో స్థిరపడ్డాక తన తరగతి చైతన్యానికి చిత్తశుద్ధితో ఎంతో కృషిచేశాడు. షెడ్యూల్డు కులాలకు, వెనుకబడిన వర్గాలకు సంబంధించిన ఎన్నో కమిటీలలో తన విద్యాధిక్యత వల్ల సభ్యుడై ఇతోధికంగా కృషి చేస్తున్నాడు. కానీ... కానీ...

కాన్ఫరెన్స్‌లో రోజర్ లెవిన్ చదివిన వ్యాసం అతని చెవుల్లో మార్మోగుతోంది. "ఆకలి మెదళ్ళు" అన్న ఆ వ్యాసం షెనువర్, డాబ్బింగ్, శాండ్స్ మొదలైన ఎందరో శాస్త్రజ్ఞుల ఎన్నో సంవత్సరాల పరిశోధనలు దాల్చిన అక్షరరూపం. తన స్నేహితులైన వాళ్ళ రీసెర్చి టాలెంట్‌కి ఎంత పొంగిపోయాడో, వాళ్ళు కనుగొన్న విషయాలకి అంత కృంగిపోయాడు.

"మీరు చూసేవుంటారు, ఇండియాలాంటి దేశాలలో వుబ్బిన పొట్టలతో, పుల్లల్లా వేళ్ళాడే కాళ్ళూ, చేతులతో, ఆసక్తిలేని చూపుల్తో చిన్నారిపాపల్ని. ఈనాడు ప్రపంచంలో మూడు వందల మిలియన్లకు పైగా పిల్లలు సరైన ఆహారం లోపించడంవల్ల అట్లా వున్నారు. ఆశావాహ ధోరణితో ఈ పిల్లలకి సరైన ఆహారం సమకూర్చగలిగితే వాళ్ళ రుగ్మత తగ్గుతుందని మనం అనుకోవడానికి వీల్లేదు. ఈ బిడ్డల ప్రజ్ఞ ఎప్పటికీ పుంజుకోలేనంతగా దెబ్బ తింటుందని మా పరిశీలనలు సూచిస్తున్నాయి.

"సృష్టిలో అతి సంకీర్ణమైన మానవ మస్తిష్కంలో కోటానుకోట్ల నాడీ కణాలున్నాయి. వాటి సక్రమాభివృద్ధి సహజాతమే అయినప్పటికీ, బిడ్డ జీవన పరిస్థితుల ప్రభావం వాటి నిర్మాణంపై ఎంతో వుంటుంది. శిశువు గర్భంలో వున్నప్పటి మొదటి 10-18 వారాలలోనే అన్ని కోట్ల నాడీకణాలు రూపుదిద్దుకుంటాయి. ఆ సమయంలో తల్లికి సరైన ఆహారం లేనట్లయితే ఈ నాడీకణాల సంఖ్య బాగా తగ్గిపోతుంది. అవి సరిగ్గా ఎదగవు. బిడ్డ జన్మించిన తర్వాత మొదటి రెండేళ్ళలో ఈ నాడీకణాల మధ్య విస్తృతంగా సంబంధాలు ఏర్పడతాయి. వయసుతోపాటు వ్యక్తులలో కన్పించే ప్రజ్ఞ, మానసిక రీతుల్లో సంకీర్ణత, భాషా పటిమ ఈ కూర్పువల్లనే. అయితే పోషకాహారం, సంపన్నమైన జీవన పరిసరాలు ఈ దశలో లోపిస్తే నాడీకణాల మధ్య ఏర్పడే ఈ సంబం·

ధాల సంఖ్య గణనీయంగా తగ్గిపోతుంది. పుట్టుకకి ముందు ఆహార లోపం చిన్న మెదడుపై కూడా తన ప్రభావం చూపి, పెద్దయినాక మొటుతనానికి, శారీరకమైన నిపుణత కొరవడటానికి దారితీస్తుంది.

"బీదతనపు పర్యవసానం భీతావహం: దానిలో మగ్గేవాళ్ళు తమ పిల్లలకి సరైన ఆహారం ఇవ్వలేరు. ఉద్దీప్తకరమైన పరిసరాల్ని కల్పించలేరు. అంటే, ఈ భూగోళం మీద నూటికి డెబ్భై మంది దారిద్ర్యం వల్ల తరతరాలుగా మెదడు సంపూర్ణంగా ఎదగకపోవటం మనే అత్యంత ప్రమాదకరమైన స్థితికి లోనై మంద మతులుగా, మొటుగా తయారవుతున్నారు.


"విషాదకరమైన విషయం ఏమిటంటే, జీవితంలో [illegible] అంటే ఎదిగాక పోషకాహారం, సంపన్న జీవన పరిసరాలు లభించినా ఆ నష్టం పూడదు. మరెన్నడూ మస్తిష్కం తన పూర్వపు సాధ్య స్థాయికి ఎదగలేదు..."

బలంగా కణతలు నొక్కుకున్నాడు ఆదెయ్య. మిగతా విషయాల్ని గుర్తుతెచ్చుకోవడానికి సమ్మెట పోట్లు తిన్న అతని మేధ సహకరించలేదు.

కాల్ లాంప్ స్విచ్ నొక్కి, ఎయిర్ హోస్టెస్‌ని అడిగి యాస్ప్రిన్ మాత్రలు రెండు మింగి, కలత నిద్రలోకి జారిపోయాడు.

* * *

హీత్రూ డ్యూటీ ఫ్రీ షాపుల్లో తన శ్రీమతికి, పదహారేళ్ళ పెద్దకొడుకు రాజేష్‌కి, పన్నెండేళ్ళ చిన్న కొడుకు భావేష్‌కి తను కొనాలనుకున్న వస్తువులు




కొన్నాడు. తనప్పుడే తిరిగి వస్తాడని వాళ్ళెవరూ అనుకోరు. కనీసం మరో రెండు వారాలయినా అమెరికాలో వుంటానని అనుకుంటారు. తన రాకతో సర్‌ప్రైజ్ ఇవ్వాలి అనుకున్నాడు.

* * *

కస్టమ్స్ నుంచి బయటపడేసరికి రాత్రి తొమ్మిది గంటలయింది. మరో అరగంటలో తను ఇంట్లో..., వెన్నెల్లో తారురోడ్డుపై జారిపోతున్న టాక్సీలో వెనక్కి వాలి కళ్ళు మూసుకున్నాడు. ఆలోచనంతో అంటే పోవడం ఆదెయ్యకి కొత్త కాదు. "ఒక గడ్డిపోచ ప్రాణం పోసుకోవాలన్నా పుడమి తల్లి పురిటి నొప్పులు పడాలి." తన భవిష్యత్తు, తన వాళ్ళ భవిష్యత్తు, తన దేశం... మానవాళి...ఆలోచనల్ని కూడదీసుకునే ప్రయత్నంలో అప్రయత్నంగా 'నేనేం చెయ్యగలను' అనుకున్నాడు.

ఆలోచనల్నుంచి తల తిప్పి బయటికి చూశాడు. వెన్నెల్లో తడుస్తున్న సముద్రం. ఆ బ్రిలియన్స్‌కి అతను కొద్దిగా రిలీఫ్ ఫీలయ్యాడు. యూనివర్సిటీ క్వార్టర్సులోకి కారు ప్రవేశించి ఎత్తుపల్లాల్ని అధిగమిస్తోంది. సముద్రం మరింత చేరువౌతోంది. అలసటెరుగని అలలు.

టాక్సీ దిగి సూట్‌కేస్‌ని స్లైడ్ చేసి, చప్పుడు కాకుండా పోర్టికోలో వదిలి, హాండ్ బాగ్‌తో లోపలికి నడిచాడు.

నిశ్శబ్దంగా లివింగ్ రూమ్ దాటి ఫామిలీ రూమ్ గుమ్మంలో అడుగుపెట్టాడు. టి.వి. స్క్రీన్ మీద మ్యాచ్‌లో అమితాబ్‌బచన్. మాస్టర్ బెడ్ రూమ్ దగ్గర భావేష్ నిలబడి ఏదో అంటున్నాడు.

"నేను సినిమా చూడను, చదువుకోవాలి" గదిలో నుంచి రాజేష్ గొంతు.

"నీకెప్పుడూ చదువేరా అన్నయ్యా. ఎందుకంతద్దాక అట్లా చదువుతావు. మార్కులు తక్కువొచ్చినా మనకి చదువుకోవడానికి సీట్లొస్తాయి. క్లాసులు రాకపోయినా ఉద్యోగాలొస్తాయి గదరా.."

ఆదెయ్య స్థాణువై......




# నూతన యవ్వనం పొందండి

సంతానవంతులుకండి!



చర్మ వ్యాధుల నుండి విముక్తులుకండి!

దురభ్యాసముల వలన కలిగిన నరముల బలహీనత, దాంపత్య సుఖము లేక పోవుట, ఉబ్బసము, మేహ మచ్చలు, మొదలగు సమస్త దీర్ఘ వ్యాధులకు అద్భుత ఆయుర్వేద చికిత్స! పోస్టుద్వారా చికిత్స కలదు.

క్యాంపులు:* ప్రతి ఆదివారం భీమవరం-షణ్ముఖ లాడ్జిలో ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 6-30 గంటల వరకు.
* ప్రతి నెల 1 మరియు 16 తేదీలలో రాజమండ్రి-హోటల్ అశోకాలో కోటగుమ్మం దగ్గర మధ్యాహ్నం 12 గంటల నుండి రాత్రి 9 గంటల వరకు.

డా డి. మార్కండేయులు
ఆయుర్వేదభిషక్, సెక్స్ & స్కిన్ స్పెషలిస్ట్
పార్కురోడ్, గుడివాడ - 521 301
ఫోన్స్ : ఆఫీసు : 522    నివాసం : 540